ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 21 జూన్ 2024

ముతుకూరు గ్రామానికి అధికారుల పరుగులు



కలుషితమవుతున్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

గుడిబండ, జూన్ 20: మండలంలోని ముతుకూరు గ్రామంలో బుధవారం 30 మందికిపైగా వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలవడంతో అధికారులు పరుగులు పెట్టారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మనోనాయక్, ఎంపీడీఓ బంగారమ్మ, డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం గ్రామంలో పర్యటించారు. వాంతులు, విరేచనాలు ఎంతమందికయ్యాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయడంతోపాటు తాగునీరు లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజలకు మినరల్ వాటర్‌ను ఉచితంగా వారం రోజులపాటు సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ చర్యలు చేపట్టారు. మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలని సర్పంచ్‌కు సూచించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాధితులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: డీఎల్‌పీఓ

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. గుడిబండలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండి మురుగు నీరు నిలువ ఉండకుండా డ్రైనేజీలను శుభ్రం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నీ సమస్యలే..

ముతుకూరులో అన్నీ సమస్యలే. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేవు. మట్టిరోడ్లే దిక్కు. వర్షపునీరు కాలనీల్లోని ఇళ్ల మధ్య నిలిచి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు. వర్షపునీరు నిలువ ఉంటుండడంతో ఈగలు, దోమలు వ్యాప్తిచెంది రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని వారు తెలిపారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.





ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

వైసీపీ కౌన్సిలర్లలో దడ...!!



మొన్నటివరకు విచ్చలవిడి

యథేచ్ఛగా అక్రమాలు, దౌర్జన్యాలు

అధికారం కోల్పోవడంతో డీలా

కూటమి గొడుగు కిందకు చేరే యత్నాలు

ధర్మవరం, జూన్ 20: వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు రెచ్చిపోయారు. విచ్చలవిడిగా వ్యవహరించారు. అక్రమాలు, దౌర్జన్యాలు సాగించారు. అధికారం తమకే శాశ్వతమన్నట్లుగా పేట్రేగిపోయారు. వారి తీరుతో విసిగిపోయిన జనం సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారు. దారుణంగా ఓడించారు. అధికారం కోల్పోవడంతో అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిన కౌన్సిలర్లలో దడ పుట్టుకొచ్చింది. ఇబ్బందులు తప్పవేమోనన్న ఆందోళన నెలకొంది. ఇప్పుడెలా అని భయంతో వణికిపోతున్నారు. అధికారం చేపట్టిన కూటమిలోకి చేరిపోవాలని భావిస్తున్నారు. ఆ దిశగా దారులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల ద్వారా చేరిపోయే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి పక్షం రోజులైందో.. లేదో.. అప్పుడే వారు పార్టీ మారేందుకు సిద్ధమవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పక్షం తిరక్కుండానే..

సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న వైసీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టింది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ధర్మవరంలో వైసీపీ పాలనలో ఐదేళ్లుగా అధికారమనే మదంతో అడ్డగోలుగా అక్రమాలు, భూదందాలకు పాల్పడిన కొందరు కౌన్సిలర్లలో టెన్షన్ మొదలైంది. తాము ఐదేళ్లలో చేసిన పాపాల చిట్టాను వెలికితీసి ఎక్కడ ఇబ్బందులు పెడతారోనన్న భయం వారిని వెంటాడుతోంది. ప్రతిపక్షంలో ఉండి కష్టాలు కొని తెచ్చుకునే బదులు అధికార కూటమి వైపు అడుగులు వేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. అధికారం లేకపోతే తమ పరిస్థితి దారుణంగా తయారవుతుందన్న నిశ్చయానికి వచ్చినట్లుంది. ఐదేళ్లలో సాగించిన సెటిల్మెంట్లు, భూకబ్జాలు, దౌర్జన్యాలు, దాడులు, అప్పటి ప్రతిపక్ష పార్టీల నాయకులపై బనాయించిన అక్రమ కేసులు ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటాయోనన్న భయం కొందరిని వేధిస్తోంది. కూటమిలోని ఏదో ఒక పార్టీలోకి చేరి, బయట పడాలని సిద్ధమవుతుండటం గమనార్హం. ధర్మవరం మున్సిపాలిటీలో 40 మంది కౌన్సిలర్లున్నారు. ఇప్పటికే సగానికిపైగా కౌన్సిలర్లు తమకు తెలిసిన కొందరు అధికార పార్టీ నాయకుల ద్వారా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఓటమి అనంతరం సామాజిక మధ్యమాల్లో విడుదల చేసిన వీడియో వైసీపీ నాయకుల్లో దడ పుట్టిస్తోంది. అధికారం కోల్పోగానే తన వద్దకు ఎవరూ రావద్దని ఆయన పేర్కొనడం ఆ పార్టీ నాయకులను అయోమయంలో పడేసింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో కూటమి తరఫున పోటీచేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులందరూ గెలుపొంది, క్లీన్‌స్వీప్ చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లలో ఆందోళన నెలకొంది. అధికారం కోల్పోయి పక్షం రోజులు గడిచాయో, లేదో.. అప్పుడే అధికార కూటమి వైపు చూస్తుండడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపింది.

అంతిమ నిర్ణయం అధినాయకులదేనా?

ధర్మవరం మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లు అధికారం కోల్పోగానే కూటమి వైపు మొగ్గు చూపుతున్నారని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది. కొందరు కౌన్సిలర్లు చేస్తున్న అరాచకాలు భరించి పార్టీని ముందుకు తీసుకొచ్చామనీ, అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకుంటే చెడ్డపేరు వస్తుందని కూటమిలోని నాయకులు, కార్యకర్తలు తమ అధినాయకుల వద్ద పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. దీంతో అధినాయకులు కూడా కొందరు కౌన్సిలర్లను ఆహ్వానించేందుకు సిద్ధంగా లేరని తెలుస్తోంది. వివాద రహితులుగా ఉన్న కౌన్సిలర్లను మాత్రం అవసరం అనుకుంటే పార్టీలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎన్డీఏలోని మూడు పార్టీల అధినాయకులు.. స్థానిక వార్డు కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకే పార్టీలోకి చేరికలు ఉంటాయని అంతర్గతంగా పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. అధికారాన్ని నిలబెట్టిన కార్యకర్తల అభిప్రాయం మేరకే నడుచుకుంటామని వారు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

రెచ్చిపోయిన కౌన్సిలర్లలో ఆందోళన

వైసీపీ హయాంలో ధర్మవరం మున్సిపాలిటీలో ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అక్రమార్జనే పరమావధిగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. భూమి, స్థల, డబ్బు వివాదాలను ఆదాయ వనరులుగా అప్పటి ప్రజాప్రతినిధి మలచుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎవరైనా వివాదాలతో కౌన్సిలర్ల వద్దకెళ్తే పరిష్కరించాల్సింది పోయి, వివాద భూములు, స్థలాలను ఏకంగా కాజేసిన దారుణాలు ఎన్నో ఉన్నాయన్న ఆరోపణలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి. ఓ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆ పదవిని స్వీకరించే వరకు పుట్టెడు ఆర్థిక కష్టాల్లో ఉన్నాడన్నది పట్టణ వాసులకు ఎరుకే. ఏడాదిపాటు ఆ పదవిలో ఉన్న ఆ కౌన్సిలర్ భారీఎత్తున డబ్బు పోగేసుకున్నాడు. ప్రస్తుతం అత్యంత విలాసవంతమైన భవనం కూడా నిర్మిస్తున్నారని తెలుస్తోంది. మరి కొందరికైతే నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఔట్లు వేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీగా సొమ్ము చేసుకున్న వారు లేకపోలేదు. అక్రమ లేఔట్ల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించిన కౌన్సిలర్లు అందులో అప్పటి ప్రజాప్రతినిధికి పర్సెంటేజీలు ముట్టజెప్పారన్న ఆరోపణలున్నాయి. దీంతో కొందరు కౌన్సిలర్లతోపాటు బయట నాయకులు ఎన్ని అక్రమాలు చేస్తున్నా అప్పటి ప్రజాప్రతినిధి వారిని వెనుకేసుకు రావడంవల్లే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చి, పరాజయం పాలయ్యారన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దాదాపు 15 మంది కౌన్సిలర్లు సెటిల్మెంట్లు, దౌర్జన్యాలు, భూదందాల్లో మితిమీరిన జోక్యం చేసుకుని, కోట్లాది రూపాయలు వెనుకేసుకున్నారని పట్టణంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ అక్రమాలు, అన్యాయాలు, సెటిల్మెంట్లు బయటపడి ఆర్థికంగా, కేసుల పరంగా నలిగిపోవడం కంటే అధికార పార్టీ చెంతకు చేరితే ప్రశ్నించేవారు ఉండరన్న భావనలో ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు మీడియేటర్ల ద్వారా, మరికొందరు కీలక నేతలను నేరుగా కలిసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్‌కు మంత్రి పదవి రావడంతో ఆయన బిజీ అయిపోయారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ కూడా రాజధానిలో ఎక్కువ రోజులు ఉండటంతో నేరుగా కలిసే అవకాశం దక్కడంలేదు. నెలాఖరులోగా ఎలాగైనా అధినాయకులను ప్రసన్నం చేసుకోవాలని అన్నివిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు కొందరు కౌన్సిలర్లే బహిరంగంగా పేర్కొంటుండడం గమనార్హం.





జిల్లాలో తేలికపాటి వర్షం



పుట్టపర్తి రూరల్ : జిల్లాలో పలుచోట్ల బుధవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా సోమందేపల్లిలో 20.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువు 14.4, అగళి 10.4, ఓబుళదేవరచెరువు 8.6, తనకల్లు 8.4, కదిరి 7.4, లేపాక్షి 4.6, బుక్కపట్నం 4.4, అమరాపురం 3.8, నల్లచెరువులో 2.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

సమష్టికృషితోనే ప్రశాంత ఎన్నికలు

సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 20: పోలీసు అధికారులు, సిబ్బంది సమష్టికృషితోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలిగామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసుల పనితీరు భేష్ అని ప్రశంసించారు. జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో గురువారం జిల్లాలోని అన్ని పోలీసు సబ్‌డివిజన్ల పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నూతన జిల్లాలో తొలి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు తలెత్తినా.. పోలీసు సిబ్బంది వేగంగా స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికల సమయంలో రూ.65లక్షల విలువచేసే 16 వేల లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని, 1002 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. 13,535 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.2.10 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. అనంతరం ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఎస్పీలు శ్రీలత, వాసుదేవన్, కన్నన్, శ్రీనివాసులు, బాబాజాన్ సైదీ, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సైబర్ సెల్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్పీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

రోడ్డు మాదే..!

ఓ వైద్యుడి వాదన

- రోడ్డు స్థలం కబ్జా
- యథేచ్ఛగా నిర్మాణాలు
- వైసీపీ వత్తాసు
- చోద్యంచూస్తున్న అధికారులు



తలుపులలో రోడ్డు స్థలంలో చేపట్టిన నిర్మాణాలు



కదిరి, జూన్ 20: తలుపుల కేంద్రం. అందులోనూ నంబులపూలకుంటకు వెళ్లే ప్రధాన రహదారి. నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ఈ రోడ్డును డబుల్ లేన్ చేయాలన్న డిమాండ్ ఉంది. అలాంటి రోడ్డే తమదంటూ తెరపైకి వచ్చాడు ఓ ప్రైవేటు వైద్యుడు. అధికారం పోయినా అరాచకాలు మానని వైసీపీ నాయకుడి అండతో ఏకంగా రోడ్డు స్థలంలో నిర్మాణాలు చేపట్టాడు. ఇదేంటని అడిగితే స్థలం తమదేనంటూ బుకాయిస్తున్నాడని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు స్థలం కూడా తమదేనంటూ చెబుతున్నాడట. తలుపుల సమీపాన టి.రెడ్డివారిపల్లికి వెళ్లే రహదారిలో ఓ ప్రైవేటు వైద్యుడు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. కొంత ఆర్ అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించినట్లు సమాచారం. పది రోజులుగా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా.. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి దగ్గరుండి పనులు చేయిస్తున్నట్లు సమాచారం. రోడ్డు పక్కనే కనీసం రెండు అడుగులు కూడా వదలకుండా రోడ్డును ఆక్రమించి, వైద్యుడు నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామప్రజలు ప్రశ్నిస్తే రోడ్డు కూడా తనదేననీ, తనకు పట్టా ఉందని బెదిరించినట్లు సమాచారం. నిర్మాణాలు పూర్తయితే రోడ్డు పక్కన పాదచారులు నడవడానికి కూడా స్థలం ఉండదు.

అక్రమ కట్టడాలపై చర్యలేవీ?

తలుపుల సమీపంలో టి. రెడ్డివారిపల్లికి వెళ్లే రహదారిలో పది రోజులుగా ఓ ప్రైవేటు వైద్యుడు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. నిత్యం ఆ రోడ్డులో తిరిగే పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి లోపాయికారీ ఒప్పందమే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ నిర్మాణాలు సక్రమమేననీ, రోడ్డును ఆక్రమించలేదని పంచాయతీ అధికారులే సెలవిస్తున్నారు. రెవెన్యూ అధికారుల పనిని పంచాయతీ అధికారులు చేసినట్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. రోడ్డు మార్జిన్లను కూడా గుర్తించలేని స్థితిలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఉండడం శోచనీయం.

ఆర్‌అండ్‌బీ స్థలం హద్దులు గుర్తిస్తాం

తలుపులలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి, కట్టడాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆర్ అండ్‌బీ స్థలం హద్దులు గుర్తించాలని ఇప్పటికే సిబ్బందిని ఆదేశించాం. తగు చర్యలు తీసుకుంటాం. - శైలజ, ఆర్‌అండ్‌బీ డీఈ, కదిరి

వైసీపీ నాయకుడి దౌర్జన్యం

తాగునీటి బోరు మరమ్మతులను అడ్డుకున్న వైనం

తప్పుబట్టిన టీడీపీ నాయకులు

పనులు చేయాల్సిందేనని పట్టుబట్టడంతో పూర్తి చేసిన సిబ్బంది



తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



మరమ్మతులు చేస్తున్న సిబ్బందిని వెనక్కి పంపుతున్న వైసీపీ నాయకుడు

కదిరి, జూన్ 20: వైసీపీ అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకులు మాత్రం దౌర్జన్యాలు ఆపట్లేదు. ప్రజలకు ఉపయోగకరమైన తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తుంటే అడ్డుకున్నాడు ఓ వైసీపీ నాయకుడు. సిబ్బందిని అక్కడి నుంచి పంపించేశాడు కూడా. మరమ్మతులు చేయాల్సిందేనని టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో అధికారులు దిగొచ్చారు. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేశారు. వైసీపీ నాయకుడి తీరుపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. కదిరిలోని 25వ వార్డు నుంచి గెలుపొందిన నజీమున్నీషా మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె వార్డులోనే ఓ తాగునీటి బోరు మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాషా బోరు వద్ద కెళ్లి, మరమ్మత్తులు చేయాలని మున్సిపల్ సిబ్బందికి చెప్పారు. ఆ మేరకు గురువారం వారు మరమ్మతులు చేస్తుండగా వైసీపీ నాయకుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త సాదిక్ బాషా అడ్డుకున్నారు. తమ వార్డులో టీడీపీ నాయకులు పనులు చేయించడం ఏంటంటూ బోరు మరమ్మతులను అడ్డుకున్నారు. పనులు చేస్తున్న కార్మికులను అక్కడి నుంచి పంపించేశారు. విషయం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ వద్దకెళ్లింది. టీడీపీ నాయకులు.. కమిషనర్‌ను కలిసి, బోరు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ వెంటనే సిబ్బందిని పంపి బోరు మరమ్మతులు చేయించారు. ప్రజలకు ఉపయోగకరమైన తాగునీటి బోరు మరమ్మతులు చేస్తుంటే అడ్డుకోవడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వార్డులోనే తాగునీటి బోరుకు మూడేళ్లుగా మరమ్మతులు చేయించకపోవడం వైసీపీ పాలన తీరుకు నిదర్శనమని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

ఛీ.. ఛీ..!

- కుళ్లిన కళేబరాలు
- కంపుకొడుతున్న నీరు
- పట్టించుకోని యంత్రాంగం
- గ్రామస్థుల ఫిర్యాదుతో ట్యాంకు శుభ్రం

మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ట

తాగునీటి ట్యాంకులో పడి కోతుల మృతి

పుట్టపర్తి, జూన్ 20: మున్సిపల్ యంత్రాంగం మొద్దునిద్రకు నిదర్శనం ఈ ఘటన. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాల్సిన బాధ్యతను గాలికొదిలేశారు. వైసీపీ పాలనలో ట్యాంకులను శుభ్రం చేయాలన్న ఆలోచనే మరిచారు. వాటిలో దుమ్ము, ధూళి కూడా పడకుండా చూసుకోవాల్సిన మున్సిపల్ యంత్రాంగం మొద్దునిద్రలో ఉంది. అది ఎంతలా అంటే.. ఎప్పుడో కోతులు ట్యాంకులో పడి, అవి చనిపోయి, వాటి కళేబరాలు కుళ్లి కంపుకొడుతున్నా.. పట్టించుకునే పరిస్థితిలో లేరంటే వారి నిర్లక్ష్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. నీరు దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులే గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్తే అప్పుడు వారు వచ్చి ట్యాంకును శుభ్రం చేయించారు మరి. పట్టణ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో ఈ ఘటన వెలుగుచూసింది. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కింద ట్యాంకు నిర్మించారు. దాని ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంకు పైన ఉన్న మూత ఇటీవల తొలగిపోయింది. వెంటనే మూత ఏర్పాటు చేయాలని స్థానికులు.. మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో నీటి కోసం వెళ్లిన కోతులు అందులో పడి మృతి చెందాయి. కళేబరాలు కుళ్లిపోయాయి. నాలుగురోజులుగా ట్యాంకు నుంచి వచ్చే నీరు దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. ట్యాంకు వద్దకు వెళ్లి, పరిశీలించి నీటిని వదిలేశారు. ట్యాంకు లోపల చూడగా.. కుళ్లిపోయిన కోతుల కళేబరాలు కనిపించాయి. వెంటనే వారు.. మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది ట్యాంకును శుభ్రం చేశారు. కలుషితమైన ఆ నీటిని తాగి ఉండుంటే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్థులు వాపోతున్నారు.





నీటి ట్యాంకు.. అందులో కుళ్లిన కోతి కళేబరం

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

బీసీ, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి సవిత

బాధ్యతల స్వీకరణ



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సవిత

పుట్టపర్తి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థిక బలహీనవర్గాల సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. వెనుకబడిన తరగతుల్లోని విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ అందించే కోచింగ్‌ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఎన్టీఆర్ విదేశీ విద్యపై రెండో సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వెనబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలో బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చేనేత, హస్త కళాకారులకు తగిన రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత వస్త్ర రంగాలను అన్ని విధాలా అందుకుంటామన్నారు. వారానికి ఒక్కసారైనా సచివాలయ ఉద్యోగులు, ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి సవితకు కళ్యాణదుర్గం, మడకశిర ఎమ్మెల్యేలు అలిమినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల టీడీపీ అధ్యక్షులు వడ్డె అంజినప్ప, వెంకటశివుడు యాదవ్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనంతరాము, పరిశ్రమలు, చేనేత వస్త్ర శాఖల ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీతతోపాటు జిల్లాలోని పలువురు టీడీపీ నేతలు.. మంత్రికి అభినందనలు తెలిపారు.



పూజలు చేస్తున్న సవిత

జోరుగా మిరప విత్తన జీరో వ్యాపారం

అనధికారికంగా వెలసిన షాపులు

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి



అనుమతులు లేకుండా వెలసిన మిరప విత్తన విక్రయ షాపు

విడపనకల్లు, జూన్ 20: మండలకేంద్రంలో మిరప విత్తన జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. అనధికార మిరప విత్తన విక్రయ కేంద్రాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఏదైనా విత్తనాన్ని విక్రయించాలి అంటే ముందుగా ప్రభుత్వం అనుమతులు పొందాలి. విక్రయ లైసెన్స్ కలిగి ఉండాలి. అయితే విడపనకల్లు మండలంలో వైసీపీ నాయకులు బరితెగించి ఎటువంటి అనుమతులు లేకుండా మిరప విత్తన విక్రయ షాపులను ప్రారంభిస్తున్నారు. ఇక్కడ మిరప విత్తన కొనుగోలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నూలు జిల్లా, కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చి వారికి కావాల్సిన విత్తనాన్ని రైతులు తీసుకెళ్తుంటారు. ఒక్కో వ్యాపారి రోజుకు వంద క్వింటాళ్లకుపైగా వ్యాపారం చేస్తుంటాడు. అంటే ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి రోజుకు ఎంత గండిపడుతోందో ఇట్టే అర్థమైపోతోంది. డబ్బి రకం క్వింటాలు రూ. 34వేల నుంచి 38వేలు, కడ్డీ రకం క్వింటం రూ.18వేల నుంచి 20 వేలకు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో రోజూ వివిధ ప్రాంతాల రైతులు కొనుగోలుకు వస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంటోంది. విత్తనాలు విక్రయిస్తే అధికారులు దాడులు చేస్తారని ఆలోచించి తెలివిగా వ్యాపారులు మిరపకాయలను రైతులకు కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్ల ఏర్పాటు చేసుకున్న మిషన్లలో మిరపకాయలను ఆడించి విత్తనాన్ని విక్రయిస్తున్నారు. మిరపకాయలు ఆడించే మిషన్లకు కూడా ఎటువంటి అనుమతులు లేకుండా స్థానిక బస్టాండ్ ప్రాంతంలో బహిరంగంగా ఏర్పాటు చేసి విత్తనాలను అమ్ముతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో దాదాపుగా మిరప విక్రయ షాపులు వందకుపైగా వెలిశాయి. రోజూ కోట్లలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి ఎటువంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా జోరుగా జీరో వ్యాపారం చేస్తున్నా మండలంలో ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదు. రైతులు కొనుగోలు చేసే విత్తనానికి ఎటు వంటి రసీదులు ఉండవు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి విత్తనాన్ని కొనుగోలు చేసిన రైతులకు ఆ విత్తనం ఫెయిలూర్ అయితే ఇక అంతే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో అనధికారికంగా వెలసిన మిరప విత్తన కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నమూనా విత్తనాలు



షాపులో సిద్ధంగా ఉన్న వివిధ రకాల విత్తనాలు

మా పరిధిలోకి రాదు

అనుమతులు లేని మిరపకాయలు విక్రయించే షాపులు ఉన్న విషయం తెలిసింది. అయితే వ్యాపారులు తెలివిగా విత్తనాన్ని విక్రయించకుండా ఎండు మిరపకాయలు విక్రయిస్తున్నారు. వ్యాపారులే వారి మిషన్లకు మిరపకాయలు ఆడించి విత్తనాన్ని రైతులకు ఇచ్చి పంపుతున్నారు. రైతులు కొనుగోళ్లు చేస్తున్నా విత్తనానికి ఎటువంటి రసీదులు ఉండటంలేదు. ఏదైనా జరిగితే రైతులు ఎవర్ని అడగాలో తెలియని పరిస్థితి ఉంది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మిరప విత్తనకాయలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్నారు. ట్యాక్స్ ఎగొట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ జీరో వ్యాపారం మా పరిధిలోకి రాదు. విత్తనాలు నేరుగా విక్రయిస్తే మేం చర్యలు తీసుకోగలం.

- పెన్నయ్య, ఏఓ, విడపనకల్లు

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురం రూరల్, జూన్ 20: అనంత వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ కు మొత్తంగా 725 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

27 నుంచి అంతర్ జిల్లా హాకీ పోటీలు

ధర్మవరం, జూన్ 20: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 27 నుంచి 30వతేదీ వరకు 14వ అంతర్‌జిల్లాల సీనియర్ పురుషుల హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు బంధనాథం సూర్యప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 20 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయన్నారు.

రెండు రోజుల్లో విద్యార్థులు వసతి గృహాల్లో చేరాలి

బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 20: జిల్లాలోని బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన రెన్యువల్ విద్యార్థులు వసతి గృహాల్లో చేరాలని, లేనిపక్షంలో వసతి కోల్పోయే ప్రమాదముందని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా రెన్యువల్ విద్యార్థులు హాస్టళ్లకు రావడం లేదన్నారు. జిల్లాలో 38 ప్రీమెట్రిక్, 17 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో 5178 మంది రెన్యువల్ విద్యార్థులు ఉండగా 2295 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మిగిలిన 2883 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు. వీరు రెండు రోజుల్లో ఆయా వసతిగృహాలకు హాజరుకావాలన్నారు. అదేవిధంగా కొత్తగా ప్రవేశాల కోసం 38 ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో బాలురు 3103, బాలికలు 1364, 17 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో బాలురు 622, బాలికలు 547 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ విద్యాసంవత్సరం కళ్యాణదుర్గంలో కొత్తగా బాలికల వసతి గృహం ప్రారంభమవుతుందన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో వసతి కోసం వార్డెన్ 8008671755ను సంప్రదించాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

కరువు బృందానికి వినతిపత్రం అందజేత



కేంద్ర బృందానికి చెందిన అధికారి కూర్మనాథకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 20: జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు అనంతపురం వచ్చిన కేంద్ర బృందాన్ని గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రైతుసంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2023 ఖరీఫ్, రబీలలో అతివృష్టి, అనావృష్టి వల్ల సాగుచేసిన వేరుశనగ, శనగ, మిరప, పత్తి, కంది, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, ఉలవలు, ఉద్దులు, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, సోయాబీన్, తెల్ల కుసుమ తదితర పంటలను రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఆయకట్టు కింద సాగుచేసిన పంటలకు సైతం నీరందలేదన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక, చేసిన అప్పులు ఎలా కట్టాలో తెలియక రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. నాలుగు సంవత్సరాలుగా అన్ని పంటలు దెబ్బతిని, కనీసం పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. 2019లో 46 మంది రైతులు, 2020లో 67, 2021లో 41, 2022లో 66, 2023లో 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ నివారణ కోసం ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించడంతోపాటు జిల్లాలోని రైతులను, కూలీలను ఆదుకునేందుకు వెంటనే జిల్లాకు రూ.10వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం నాయకుడు వన్నూరప్ప పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

కేంద్ర కరువు బృందం అధికారి రితేష్ చౌహాన్‌కు ఎంపీ వినతి



రితేష్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, జూన్ 20: అనంత ఉమ్మడి జిల్లాలో గత ఏడాది రబీ సీజన్‌లో పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం టీం లీడర్ రితేష్ చౌహాన్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది రబీ సీజన్‌లో వర్షాభావంతో పప్పుశనగతో పాటు ఇతర రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. బాధిత రైతులకు పంటనష్టపరిహారం అందించేలా నివేదికలు అందించి ఆదుకోవాలని కోరారు. పంటనష్టపోయిన రైతులకు రూ.140 కోట్లు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంతకల్లు, జూన్ 20: దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖాజీపేట్-బాలార్షా రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న సేఫ్టీ రిలేటెడ్ పనుల కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం-గుంతకల్లు, అనంతపురం-డోన్ స్టేషన్ల మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను రద్దుపరచనున్నామని, మరికొన్నింటికి సంబంధించి దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

రద్దుకానున్న రైళ్లు

మైసూరు-జైపూర్ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12975) రైలును ఈ నెల 27, 29, జూలై 4, 6 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12976)ను జూన్ 24, 26, జూలై 1, 3 తేదీల్లో రద్దుపరుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-జబల్పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12193)ను ఈ నెల 23, 30 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12194)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (22533)ను ఈ నెల 24, జూలై 1వ తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22534)ను జూన్ 26, జూలై 3 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. యశ్వంతపూర్-గయ వీక్లీ ప్రత్యేక రైలు (నెం. 06217)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06218)ని జూన్ 24, జూలై 1వ తేదీలలో రద్దుచేశామన్నారు. అదే విధంగా హుబ్లీ-గోమతి నగర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నెం. 07305)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07306)ను ఈ నెల 25, 27 తేదీల్లో రద్దుపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

దారిమళ్లిన రైళ్లు

గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ రైలు (నెం. 12591)ను ఈ నెల 29, జూలై 6 తేదీల్లోనూ, రైలు (నెం. 12592)ను ఈనెల 24, జూలై 1 తేదీల్లోనూ మజ్రి, ముడ్‌ఖేడ్, నిజామాబాద్, సికింద్రాబాద్ మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్-బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్ (నెం. 22691/92) రైళ్లను జూలై 3, 4, 5 తేదీల్లో సేవాగ్రాం, వార్ధా, అకోలా, నాందేడ్, నిజామాబాద్, సికింద్రాబాద్ మీదుగా మళ్లించనున్నామన్నారు. యశ్వంతపూర్-హజ్రత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12649)ను జూలై 3, 5 తేదీల్లో గుంతకల్లు, వాడి, డౌండ్, మన్మాడ్, ఇటార్సి స్టేషన్ల మీదుగా మళ్లిస్తున్నామని, బెంగళూరు-న్యూఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ (నెం. 12627)ను ఈ నెల 28వ తేదీన అరగంట, 29వ తేదీన రెండు గంటల ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12628)ని ఈనెల 28, 29 తేదీల్లో గంటన్నరపాటు ఆలస్యంగా నడుస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

గుంతకల్లు: రైల్వే ట్రాక్ పనుల కారణంగా గుంతకల్లుకు చెందిన రెండు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-బోధన (నెం.07671) రైలును జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, కాచిగూడ-గుంతకల్లు రైలు (నెం.07670)ను జూలై 2వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సెలవులో హౌసింగ్ పీడీ

అనంతపురం సిటీ, జూన్ 20: వైసీపీ పక్షపాత అధికారిగా ఆరోపణలున్న జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ నరసింహారెడ్డి శుక్రవారం నుంచి వారం రోజుల పాటు సెలవులో వెళ్లడం చర్చనీయాంశమైంది. అంతేకాకుండా అదే కార్యాలయంలో పనిచేస్తున్న డీఈఈ నారాయణమ్మకు ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు ఇవ్వాలని ఆయన కలెక్టర్‌కు సిఫార్సు చేయడం ఆ శాఖలో కలకలం రేపుతోంది. అనంతపురం ఈఈ శైలజ ఉండగా.. డీఈఈకి ఇన్‌చార్జిగా సిఫార్సు చేయడంపై విమర్శలకు తావిస్తోంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతోనే పీడీ సెలవులో వెళ్లినట్లు సమాచారం. అయితే ఇటీవల ఆయన కాలికి గాయం కావడంతో సెలవులో వెళ్లారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.


అన్వేషణ

పనిచేసే అధికారుల కోసం జల్లెడ

వైసీపీ ఐదేళ్ల విధులపై నివేదికలు తెప్పించుకుంటున్న నాయకులు

కీలక పోస్టులపై మరింత ఆరా

వైసీపీతో అంటకాగిన వారికి స్వస్తి



హిందూపురం, జూన్ 20: వైసీపీ పాలనలో విధుల్లో ప్రజలకు సేవ చేయడంకంటే అధికార పార్టీ నాయకులు చెప్పినవాటికి తలూపే వారికి, ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసేవారినే ఎన్నుకుని పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అలాంటి వాటికి స్వస్తిపలికి ప్రజాసమస్యలు పరిష్కరించేవారికి, పాలనపై దృష్టిపెట్టే అధికారుల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అన్వేషిస్తున్నారు. వైసీపీ పాలనలో పనిచేసిన అధికారులకు అధికశాతం మందికి వైసీపీ నాయకులు మరకలంటించారు. బాగా పనిచేసే అధికారులను పక్కనబెట్టి, ప్రజలతో సత్సంబంధాలులేని వారికి పోస్టింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో మంచి అధికారులు, బాగా పనిచేసేవారినే నియమించుకోవాలనీ, గత ప్రభుత్వం చేసిన తప్పిదం చేయకూడదంటూ పైస్థాయి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వారం రోజులుగా పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఎంపీడీఓ, ఎక్సైజ్‌తోపాటు ప్రజలతో సత్సంబంధాలున్న శాఖలకు సంబంధించి అధికారుల కోసం వెతుకులాటలో పడ్డారు.

పనిచేసే అధికారుల కోసం జల్లెడ

సమర్థవంతంగా పనిచేసే అధికారులను తీసుకొచ్చే పనిలో ఎమ్మెల్యేలు పడ్డారు. మరికొన్ని చోట్లయితే గత తెలుగుదేశం హయాంలో బాగా పనిచేసిన అధికారుల కోసం జల్లెడ పడుతున్నారు. కొన్నిశాఖల్లో జిల్లాలో పట్టుమని పదిమంది కూడా వారు ఊహించినట్లు దొరకట్లేదని తెలుస్తోంది. దీంతో పక్కజిల్లాలో పనిచేసే వారిపై కూడా ఆరాతీస్తున్నారు. పోలీస్‌శాఖలో ఈ అన్వేషణ అధికంగా ఉంది. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులను ఇక్కడకు రప్పించుకునేందుకు ఆరాతీస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హిందూపురం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఎన్నడూలేని విధంగా సుపారీ హత్యలు జరగడం, గంజాయి వ్యాపారం వీధి వీధినా దుకాణాలు తెరవడం, పల్లెకో పేకాట కేంద్రం నిర్వహించడం, మద్యం విచ్చలవిడిగా అమ్మకం వంటికి జరిగాయి. వీటికి చెక్ పెట్టాలంటే హిందూపురానికి బాధ్యతగా పనిచేసేవారు కావాలి. అటువంటి వారిని అన్వేషించే పనిలో నాయకులు పడ్డారు. ప్రస్తుతం జిల్లాలో అలాంటి వారు కనిపించకపోవడంతో పక్క జిల్లాలో లూప్‌లైన్‌లో ఉన్న అధికారుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వైసీపీ పాలనలో ఐదేళ్లలో అధికారులు ఎలా పనిచేశారు. అక్కడ ప్రతిపక్షానికి, అధికార పక్షంతో ఎలా మెలిగారు..? అవినీతికి పాల్పడ్డారా..? అనే అంశాలపై ఆరాతీస్తున్నారు. ఆ దిశగా వారి ట్రాక్ రికార్డుతో నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

కీలక పోస్టులపై మరింత ఆరా..

జిల్లాస్థాయి అధికారుల విషయంలో మరిన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారు. 2019నుంచి 2024 వరకు వారు పనిచేసిన జిల్లాల్లో ఎలా వ్యవహరించారన్న విషయంపై లోతుగా ఆరాతీస్తున్నారు. మంచి పాలన అందించాలంటే అధికారుల సహకారం ఎంతో అవసరం. జిల్లా స్థాయిలో కీలక పోస్టుల్లో ఉన్నవారు చాలా జాగ్రత్తగా పనిచేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఇద్దరు మంత్రులతోపాటు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ కావడంతో ఇక్కడ పనిచేసే అధికారులు విధులపట్ల మరింత జాగ్రత్తగా మెలగాల్సి ఉంటుంది. ఇదే సందర్భంలో బాలకృష్ణ. అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆయన బిజీగా ఉంటారని భావించినా జిల్లా ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటారు. దీంతో ఇక్కడ పనిచేసే అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన వారికి స్వస్తిపలికి ప్రజాపాలనకు పాటుపడి, విధుల్లో మంచి పనితీరు కనబరిచే వారికోసం అన్వేషిస్తున్నట్లు ఓ ముఖ్య ప్రజాప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

చనిపోయిన ఐదురోజులకు పోస్టుమార్టం

బుక్కపట్నం, జూన్ 20: యువతి చనిపోయిన ఐదు రోజుల తరువాత పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మారాల గ్రామానికి చెందిన స్రవంతి (20) ఈనెల 15న మృతి చెందింది. ముదిగుబ్బ మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన రవిచంద్రను ప్రేమిస్తున్నానని స్రవంతి తన తండ్రి ఈదుల సుధాకర్‌కు తెలిపింది. ఆయన మందలించడంతో ధర్మవరం మండలంలోని బిల్వంపల్లి గ్రామంలోని అమ్మమ్మ మస్తానమ్మ వద్ద ఉంటోంది. అయితే 15వ తేదీన స్రవంతి మృతి చెందినట్లు మస్తానమ్మ సుధాకర్‌కు ఫోన్ చేసింది. సుధాకర్‌తోపాటు బంధువులు శ్రావంతి మృతదేహాన్ని మరాల గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. అయితే తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి సుధాకర్ బుధవారం ధర్మవరం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ధర్మవరం రూరల్ ఎస్ఐ నరేంద్రతోపాటు బుక్కపట్నం తహసీల్దార్ భారతి, వైద్యులు క్రాంతికుమార్, హేమీమాభూషణ్, ఎఎస్ఐ రమణ మరాలకు చేరుకుని శ్రావంతి సమాధిని తవ్వి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రమౌళి (ఫైల్)

నార్పల, జూన్ 20: మండలంలోని బొందలవాడ గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో రైతు చంద్రమౌళి (48) మృతి చెందాడు. చంద్రమౌళి అరటిపంటను సాగుచేస్తున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటర్ ఆన్ చేశాడు. విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి తండ్రి వన్నూరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వాహనాల దారి మళ్లింపు

పెనుకొండ టౌన్: సోమందేపల్లి మండలం చాకర్లపల్లి రైల్వే గేటు మరమ్మతు పనుల నేపథ్యంలో వాహనాల దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే లెవెల్‌క్రాస్ వద్ద శుక్రవారం పెద్దఎత్తున మరమ్మతు పనులు చేపడుతుండగా గురవారం అర్ధరాత్రి నుంచి హిందూపురం-పెనుకొండ ప్రధాన రహదారిలోని గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. అటువైపు వెళ్లే వాహనదారులు ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

24న పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 20: రాయలసీమ స్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 24న స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల అథ్లెట్లు హాజరవుతారన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9390388169, 8074106154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

- ఎంఈఓలు, హెచ్‌ఎంల పిలుపు
- పలు చోట్ల 'నేను బడికిపోతా' ర్యాలీలు


ఓడీసీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


నంబులపూలకుంటలో..


నల్లచెరువులో..


నల్లమాడ మండలం కురమాలలో..

ఓబుళదేవరచెరువు, జూన్ 20: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ పిలుపునిచ్చారు. నేను బడికిపోతా కార్యక్రమంపై మండలకేంద్రంలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్సీ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. 6నుంచి 14 ఏళ్ల లోపు వయసున్న బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. బడి మధ్యలో మానివేసిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బ్యాగ్‌తోపాటు మధ్యాహ్న భోజనం కల్పిస్తోందని, తల్లిదండ్రులు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కె.అన్సర్‌వలీ, నరసింహులు, చెన్నకేశవులు, జనార్ధన్, కేశవ, సుధాకర్, వెంకటేష్, జయమ్మ, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: నేను బడికిపోతా కార్యక్రమంపై మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రధాన రహదారిపై మానహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. 6నుంచి 14 ఏళ్ల లోపు వయసున్న బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, బూట్లు, బ్యాగులు, మధ్యాహ్నం భోజనం అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శిరీష, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నేను బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులగుండా ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపి చదివించాలని కోరారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కురమాల గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యా పాఠశాలల హెచ్‌ఎంలు భాస్కర్‌రెడ్డి, షామీర్‌బాషా మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పక బడికి పంపాలన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు సుధాకర్, రామలింగారెడ్డి, సూర్యుడు, రత్నంరాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలకేంద్రంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు నేను బడికిపోతా కార్యక్రమంపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కదిరి-రాయచోటి రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓలు కృష్ణనాయక్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి సహకరించాలని కోరారు.


గాండ్లపెంటలో మానవహారం..

సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలిద్దాం


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

తాడిమర్రి, జూన్ 20: సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ సెల్వియా సాల్మాన్ కోరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనిమియా నిర్మూలనలో అందరూ పాలు పంచుకోవాలన్నారు. దాని బారిన పడ్డవారి జాబితాను ముందుగా సేకరించాలని, అనంతరం తగిన వైద్యసేవలు అందించాలని సూచించారు. తర్వాత ఈ మేరకు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, గోవర్ధన్‌నాయుడు, సీహెచ్‌ఓ హేమలత, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, జానకిరాం పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్‌స్తంభం తొలగింపు

ధర్మవరం, జూన్ 20: పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని గురువారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. అనంతరం దాని స్థానంలో కొత్తస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్యకుమార్ పీఆర్‌టీ వీధికి వచ్చినప్పుడు స్థానికులు విద్యుత్‌స్తంభం గురించి తెలిపారు. 30ఏళ్లకుపైగా ఇక్కడ ఇనుప విద్యుత్‌స్తంభం ఉంది. వర్షాకాలంలో ఈ స్తంభానికి కరెంటు సరఫరా అవుతుందని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామని ఆయన అప్పుడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది ఆ స్తంభాన్ని మార్చారు. దీంతో స్థానికులు సమస్య తొలగిందని ఊపిరి పీల్చుకున్నారు.


ఇనుప స్తంభాన్ని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ఘనజీవామృతం తయారు చేస్తున్న రైతులు

తనకల్లు, జూన్ 20: మండలంలోని కొత్తకురువపల్లి (గొల్లపల్లి) గ్రామంలో గురువారం జనజాగృతి వారు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వాటర్ ప్రాజెక్టు టీమ్ లీడర్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలో 1,683 మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నీటి వాడకంలో మార్పులు తీసుకురావడం, పురుగు, రసాయన మందులు లేని వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, చిరుధాన్యాలు, నవధాన్యాలు సాగుచేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా ఘన, ద్రవ జీవామృతాలు తయారీలో శిక్షణ ఇస్తున్నామన్నారు. రైతులే స్వతహాగా వాటిని తయారు చేసుకునేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. గో మూత్రం, పేడతో తయారు చేసే జీవామృతం గురించి తెలియచేశారు. అనంతరం రైతుల చేతనే వాటిని తయారు చేయించారు. రసాయన మందులు లేని వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జనజాగృతి సిబ్బంది, కొత్తకురపల్లికి చెందిన రైతులు పాల్గొన్నారు.

అనుసంధానంపై హర్షం

పుట్టపర్తి జూన్ 20: ఉపాధి హామీపథకాన్ని ఉద్యాన వన వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతకం చేయడంపై పట్టణంలోని బీజేపీ నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. నాయకులు కొండమరాజు, జ్యోతిప్రసాద్, కత్తిరాజారెడ్డి, బాలగంగాధర్, సోకేరామాంజనేయులు, కల్యాణ్‌లు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారంతో రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం రైతులకు ఎంతోప్రయోజనకరమన్నారు. రోజురోజుకు రైతులకు వ్యవసాయం భారంగా మారుతున్న తరుణంలో ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడం ఎంతో ఊరట కలిగించే అంశమని ఆనందపడ్డారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ధర్మవరం, జూన్ 20: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని చంద్రన్న ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నామన్నారు. ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు పాల్గొనాలని కోరారు. రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ కొద్దిసేపు తప్పక యోగా చేయాలని సూచించారు.

నేడు గ్రంథాలయం ప్రారంభం

కొత్తచెరువు, జూన్ 20: మండలంలోని బండ్లపల్లి ఉన్నతపాఠశాలలో శుక్రవారం గ్రంథాలయ్యాన్ని ప్రారంభించనున్నట్లు కియా,హుండయ్ కంపెనీల ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో రూ.12లక్షల వ్యయంతో అత్యాధునిక వసతులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోటీ పరీక్షలకు వివిధ రకాల పుస్తకాలను బెంగళూర్, అనంతపురం నుంచి కొనుగోలు చేసి అందులో ఉంచామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇక నుంచి త్వరితగతిన సమస్యల పరిష్కారం

ముదిగుబ్బ, జూన్20: రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ముదిగుబ్బ మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం మండలంలో ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యంగా మండలకేంద్రంలో 30పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, హిందూ శ్మశానవాటిక, ముస్లింల ఖబరస్థాన్, ఈద్గా ఏర్పాటుతో పాటు మండలంలో తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రహదారులు, కల్వర్టు తదితర సమస్యలను సత్యకుమార్, పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళతామన్నారు. వారు త్వరితగతిన వీటిని పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. సత్యకుమార్ మంత్రి కావడంతో మండలంలోని అన్ని సమస్యలు పరిష్కారమతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అమీర్ బాషా, బాలచంద్ర, ఆంజనేయులు, రవితేజ, లింగారెడ్డి పాల్గొన్నారు.

కుటాలపల్లిలో కంటి వైద్యశిబిరం

నల్లమాడ, జూన్ 20: మండలంలోని కుటాలపల్లి, కుటాలపల్లితండాలో అల్ట్రావిజన్ ఐకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటివైద్య శిబిరం జరిగింది. ఈశిబిరంలో 60మందికి కంటి పరీక్షలు చేసి 20మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అనంతరం వీరికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్, సోము, రమ్య, అమృత, వర్షిణి, మనిషా తదితరులు పాల్గొన్నారు.

200మందికి గుండె వైద్యపరీక్షలు

నల్లచెరువు, జూన్ 20: మండలకేంద్రంలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రెండువందల మందికి గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు, మదనపల్లికి చెందిన శ్రీవెంకటేశ్వర ఆసుపత్రి వైద్యుడు బాలకిషోర్ ఈ వైద్య పరీక్షలు చేశారు. అందులో దాదాపు 11మందికి యాంజియోగ్రామ్ అవసరమని గుర్తించారు. వీరికి అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రికి పంపామని వైద్యుడు తెలిపారు. వారికి అవసరమైన శస్త్ర చికిత్సలు ఆరోగ్య శ్రీద్వారా చేయనున్నట్లు చెప్పారు. శిబిరానికి సహకరించిన షిర్డీ సాయి ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాయల్టీ వసూలు బెడద తప్పేదెప్పుడు?



సంజీవపల్లి వద్ద ఏర్పాటైన రాయల్టీ వసూలు చేసే కేంద్రం

నల్లచెరువు, జూన్ 20: గత వైసీపీ పాలనలో సామాన్యులు గృహ నిర్మాణాల కోసం కంకర, మట్టి, ఇసుక తోలితే రాయల్టీ వసూలు చేసేవారని, ఇప్పుడు ఆ బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇసుక, మట్టి తదితరాలు తోలితే ట్రాక్టర్‌కు రూ.700, టిప్పర్‌కు రూ2,800 వంతున రాయల్టీ పేరుతో వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇందుకోసం మండలంలోని సంజీవపల్లి జాతీయ రహదారిపై గనులు, ఖనిజాల తనిఖీ కేంద్రం పేరుతో వసూలు కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేశారంటున్నారు. రోడ్డుపై ఇసుక, మట్టితో ట్రాక్టర్లు, టిప్పర్లు వెళితే చాలు సిబ్బంది ఆపి రాయల్టీ వసూలు చేస్తున్నారంటున్నారు. దీంతో ఇళ్లు కట్టే సామాన్యులు, పేదలకు అదనపు భారం పడుతోందంటున్నారు. ఈవసూల దందా గత ప్రభుత్వం నుంచే వచ్చిందంటున్నారు. ఇలాంటి అక్రమ వసూలు నిలిపివేసి, సామాన్యులను , పేదలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

- ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి సూచన
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం


ధర్మవరంలో ఆర్డీఓ, రిటైర్డ్ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ధర్మవరం రూరల్, జూన్ 20: రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేసి, రెవెన్యూ శాఖపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని, రిటైర్డ్ తహసీల్దార్ వెంకటేశును పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. 1786లో ఇదే రోజున రెవెన్యూ బోర్డు ఏర్పాటైందన్నారు. అందుకే ఈ రోజున రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ కార్యాలయపు, తహసీల్దార్ కార్యాలయపు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓగా పని చేసి రిటైర్డ్ అయిన ఓబులరెడ్డిని తహసీల్దార్ నరేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పూలమాలలు, శాలువాతో సన్మానించారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ వీఆర్‌ఏలు వెంకటదాస్, నరసింహులును రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి, సర్వే డిప్యూటీ తహసీల్దార్ రమణబాబు, ఆర్ఐ అశోక్‌కుమార్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు


పుట్టపర్తిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


నల్లమాడలో..

పుట్టపర్తి, జూన్ 20: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్ నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను పట్టణంలో గురువారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్‌కూడలిలో పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పలువురు మాట్లాడుతూ టీడీపీ గెలుపులో భువనేశ్వరి కీలకభూమిక పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, బేకరినాయుడు, భీమినేని కిష్టప్ప, చెన్నప్ప, కోఆప్షన్ మాజీ సభ్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నల్లమాడ: నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను మండలకేంద్రంలోని స్వాతిక్లినిక్‌లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టినాగభూషణనాయుడు, చెన్నారెడ్డి, బాలిరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు

ఓబుళదేవరచెరువు, జూన్ 20: మండలంలోని కొండకమర్ల పంచాయతీలో నవాబుకోట,చెరువుమునెప్పగారిపల్లికి వెళ్లే రహదారిపై గల కల్వర్టు (చిన్నపాటి వంతెన) ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బ తింది. గతంలో కొద్దిగా దెబ్బతిన్న వంతెన ఇప్పుడు వర్షాలకు పూర్తిగా కూలిపోయింది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నవాబుకోట, కొండ తిమ్మయ్యగారిపల్లి, చెరువుమునెప్పగారిపల్లి గ్రామాల్లో ప్రజలకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే కనీసం 108 వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో పాదచారులు ఆదమరిస్తే అంతే సంగతులు. అధికారులు స్పందించి కూలిన కల్వర్టును మరమ్మతులు చేయాలని ఆయాగ్రామస్థులు కోరుతున్నారు.


కూలిపోయిన రహదారిపై కల్వర్టు

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి: ఎస్‌ఎఫ్‌ఐ

హిందూపురం అర్బన్, జూన్ 20: నీట్-2024 ఫలితాలపై విద్యార్థుల తల్లితండ్రులకు అనేక అనుమానాలు ఉన్నందున సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒకే పరీక్షా కేంద్రంలో ఒకే సీరియల్ నంబర్లతో ర్యాంకులు రావ డం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది జీవితాలు ఆధారపడి ఉన్నాయన్నారు. నీట్ ఫలితాలపై ప్రత్యేక బృందాలతో సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జశ్వంత్, పవన్, లిఖిత్, అభి, హుసేన్, మహేష్, విక్రమ్, సురేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

గుడిబండ, జూన్ 20 : ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట సాగుకోసం సేంద్రియ ఎరువులు వాడినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని పుట్టపర్తి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. స్థానిక ఆర్బీకే కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అంతర్ పంటలను సాగుచేయాలన్నారు. ప్రధానంగా వేరుశనగ పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలన్నారు. రైతులు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

ధర్మవరం రూరల్, జూన్ 20: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రైతు యుగంధర్‌రెడ్డి గురువారం తన పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. విషయాన్ని ఆయన కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.30వేలు వితరణ

ధర్మవరం రూరల్, జూన్20: మండలంలోని ఏలుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన కంసల దేవేంద్ర ఆచారి రూ.30వేలు నగదును వితరణ చేశారు. పాఠశాలలో గురువారు నగదను హెచ్‌ఎం హనుమంతరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. పాఠశాలలో ఏదేని సమస్య పరిష్కానికి ఈ నగదును వెచ్చించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదాన సత్రం వార్షికోత్సవం

కదిరి, జూన్ 20: పట్టణంలోని శ్రీవాసవి అన్నదాన సత్రం రెండో వార్షికత్సోవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణస్వామి వ్రతం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, ఆర్యవైశ్యసంఘం గౌరవాధ్యక్షుడు సత్రసాల శంకర్‌నారాయణ, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి ఆలయానికి గుర్తింపుపై హర్షం

తాడిపత్రిటౌన్, జూన్ 20: పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో ఆలయ అర్చకులతోపాటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో మారిన 10వ తరగతి పాఠ్యపుస్తకాల్లో సాంఘికశాస్త్రం చరిత్ర పాఠ్యపుస్తకం కవర్‌పేజీపై ఆలయ గోపురం ముద్రించారు. దీనిపై ఆలయ అర్చకులు స్పందిస్తూ రాయలవారి పాలనలో నిర్మితమైన అత్యద్భుత శిల్పకళతో మన చరిత్ర, నాగరికత నేటి తరంతోపాటు భవిష్యత్తు తరాలకు అందించే విధంగా ఉన్న ఆలయానికి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ గోపురం ఉన్న పాఠ్యపుస్తకాన్ని అర్చకులు శంకరయ్య, మహేష్‌శర్మ, రవిశర్మ, గిరీష్‌శర్మ, నందశర్మ ప్రదర్శించారు.

నగలు, నగదు కోసం వృద్ధురాలి హత్య


హత్యకు గురైన వడ్డె చంద్రక్క

మడకశిర రూరల్/పావగడ, జూన్ 20: డబ్బు, బంగారు నగల కోసం మహిళ గొంతుకోసి హత్యచేసినట్లు పావగడ పోలీసులు తెలిపారు. ఈ సంఘట న పావగడ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మాచరాజనహళ్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పావగడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర మండలం ఆంధ్ర ,కర్ణాటక సరిహద్దులో ఉన్న ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క(62) తన పొలంలో పనిచేస్తుండగా బుధవారం సాయంత్రం గుర్తుతెలియని దుండగులు ఆ మె వద్ద ఉన్న రూ.25వేలు నగదు, చెవిలో ఉన్న బంగారు కమ్మలు లాక్కున్నారు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆమె గొంతుకోసి అక్కడి నుంచి పరారై ఉంటారని తెలిపారు. అటుగా వెళ్లినవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసు కున్న అడిషనల్ ఎస్పీ మరియప్ప, సీఐలు సురేష్, గిరీష్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు. త్వరలోనే హంతకులను పట్టుకుంటామన్నారు.

మూలనపడ్డ విద్యార్థినుల సైకిళ్లు

ఐదేళ్లుగా పంపిణీకి నోచుకోని వైనం

గోరంట్ల, జూన్ 20: పట్టణంలోని ప్రభుత్వంబాలికోన్నతపాఠశాలలో ఐదు సంవత్సరాలుగా స్టోర్ గదిలో మూలప డేశారు. ఆ 15 సైకిళ్లను ఇప్పుడైనా విద్యార్థినులకు పంపిణీ చేసి సద్వినియోగం అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. బాలికల్లో విద్యను ప్రోత్సహిస్తూ, వారిలో అక్షరాస్యతను పెంపొందించడానికి 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఉచితంగా వారికి సైకిళ్ల పంపిణీ చేసింది. మండలంలోని విద్యార్థినుల కోసం సైకిళ్ల పంపిణీకాగా... బాలికోన్నత పాఠశాల భవ నాన్ని స్టాక్ పాయింట్‌గా వినియోగించుకున్నారు. అప్పట్లో 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి 2019లో విద్యార్థునుల కోసం సైకిళ్ల సరఫరా చేశారు. అయితే ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో వాటి పంపిణీ నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిపై చంద్రబాబు ఫొటో ఉందని పంపిణీ చేయలేదు. తరువాత మనసు మార్చుకుని చంద్రబాబు ఫొటో స్టిక్కర్లు తొలగించి మండలంలోని పాఠశాలలకు సరఫరా చేసి, బాలికలకు అందించారు. ఇంకా మిగిలిన సైకిళ్లను పాఠశాలలోనే వదిలేశారని బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత తెలిపారు. ఆ తరువాత విద్యాశాఖాధికారుల అనుమతితో కొండాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు కొన్నిసైకిళ్లను తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇక అప్పటినుంచి 15 సైకిళ్ల స్టోర్ గదిలో అలా గే ఉంచాల్సి వచ్చిందన్నారు. సంబంధి తాధి కారులు చిన్నపాటి మరమ్మ తులు జరిపి వాటిని అవసరమున్న విద్యార్థి నులకు పం పిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.


గోరంట్ల పాఠశాల స్టోర్ గదిలో పడివున్న సైకిళ్లు

సత్యనారాయణ స్వామి ఆలయంలో నేటి నుంచి ప్రత్యేక పూజలు

హిందూపురం అర్బన్, జూన్ 20: పట్టణ పరిధిలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, పుష్పార్చన, శనివారం ఉదయం 8 గంటలకు ప్రాకారోత్సవం, అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఉంటాయన్నారు. మధ్యాహ్నం, సాయంత్రం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేపడుతామన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, దాని అనుబంధ సంఘాల భజనలు ఉంటాయన్నారు. అదే విధంగా ఆదివారం ఉదయం 7 గంటలకు కలశాలతో నగరోత్సవం, స్వామి వారికి కలశాభిషేకం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావలెనని కోరారు.

బైబిల్ మోక్ష మార్గ ఉపదేశ సభలు


మహాసభలో ప్రసంగిస్తున్న పాస్టర్ సుధాకర్

పెనుకొండ, జూన్ 20 : స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో ఫాదర్ సుధాకర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన బైబిల్ మోక్ష మార్గ ఉపదేశ సభలు గురువారం ముగిశాయి. రెండో రోజు మహాసభలకు ముఖ్య అతిథులుగా బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యుడు జాన్సన్, పీఎస్ దైవాదీనం, ప్రభాకర్‌రాజు, ఉమ్మడి జిల్లాల పోస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచి, ప్రేమానురాగాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాఠశాలను పునఃప్రారంభించండి

ఎంఈఓకు బంజారా నాయకుల వినతి


ఎంఈఓ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గోరంట్ల, జూన్ 20: మండలంలోని కొప్పునపల్లి తండా గ్రామంలో మూడేళ్ల కిందట మూసి వేసిన ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు ఎంఈఓ గోపాల్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించారు. బంజారా నాయకులు రవీంద్రనాయక్, వసంత్‌నాయక్, రమేష్ నాయక్, పరమేశ్వర్‌నాయక్ గోరంట్లలోని ఎంఈఓ కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు. కొప్పునపల్లి తండాలో 80కుటుంబాలు ఉన్నాయని, పాఠశాల నిర్వాహణకు అనువైన నూతన భవనం ఉందన్నారు. బడి ఈడు పిల్లలు 20మంది తండాలో ఉన్నట్లు చెప్పారు. పాఠశాలను మూడేళ్ల కిందట మూసివేశారన్నారు. వారు ఐదు కిలోమీటర్ల దూరంలోని ఇతరగ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని, గ్రామంలో పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు. విద్యార్థుల ఆధార్‌కార్డులతో సమాచారం ఇస్తే, పాఠశాల పునఃప్రారంభానికి కృషి చేస్తామని ఎంఈఓ తెలిపినట్లు వారు చెప్పారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

గుడిబండ, జూన్ 20: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట సాగుకోసం సేంద్రియ ఎరువులు వాడినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని పుట్టపర్తి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. స్థానిక ఆర్బీకే కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అంతర్ పంటలను సాగుచేయాలన్నారు. ప్రధానంగా వేరుశనగ పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలన్నారు. రైతులు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 20: మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద ఉన్న బెస్టు యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చరల్ విద్యార్థి ముకేష్‌గౌడ్ గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ముకేష్‌గౌడ్ యూనివర్సిటీలో చదువుతూ గోరంట్లలో ఉంటున్నాడు. ప్రేమ వ్యవహారం విషయంలో మన స్థాపానికి గురై బుధవారం రాత్రి నాలుగు నిద్ర మాత్రలు మింగాడని, మళ్లీ గురువారం ఉదయం ఆరుమాత్రలు మింగడంతో అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. అతడికి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఉష చికిత్సలు అందించారు. అనంతరం 108 వాహనం ఆలస్యంగా వస్తున్నట్లు సమాచారం అందడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో హిందూపురం వెళ్లారు.

గడ్డివామి దగ్ధం

రొళ్ల, జూన్ 20: మండలంలోని ఆర్ గొల్లహట్టి గ్రామంలో నాగప్పకు చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. దీంతో దాదాపు మూడు లోడ్ల గడ్డి అగ్నికి ఆహుతైందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష నష్టం వాటిల్లిదని తెలిపాడు. పశువులకు మేత కొనాలంటే లక్షల్లో డబ్బు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందని, మేత లేకపోవడంతో వాటిని ఎలా పోషించాలని ఆందోళన చెందాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చిన్నారి అదృశ్యం


పావని (ఫైల్)

నార్పల, జూన్ 20: నార్పల కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన పావని (6) చిన్నారి గురు వారం అదృశ్యమైనట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన గణేష్ కుమార్తె పావని ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ బయటికి వెళ్లిపోయి అదృశ్య మైనట్లు తెలిపారు. పలుచోట్ల వెతికినా కనిపించలేదని, ఈ చిన్నారి ఎవరికైనా కనిపిస్తే 94901 06853 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్న అధికారులు

గోరంట్ల, జూన్ 20: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అక్బల్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను రెవెన్యూ సిబ్బంది పూలమాలతో సత్కరించారు. రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు, తదితర స్థితిగతులు, ప్రజాప్రయోజనాల గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, మండలంలోని వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు


కేక్‌కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జూన్ 20: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని దేవాలయాల్లో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విష సంస్కృతిని విడనాడాలి: గుండుమల


దుండగులు పెరికివేసిన వక్క మొక్కలను చూపుతున్న బాధితులు

రొళ్ల, జూన్ 20: మండలంలోని బంద్రేపల్లిలో కృష్ణప్ప అనే రైతుకు చెందిన వక్క మొక్కలను అగంతకులు పెరికి వేశారు. ఈ విషయం తెలియడంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పరిశీలించి రైతుకు ధైర్యం చెప్పారు. గ్రామాల్లో ఇలాంటి విష సంస్కృతిని విడనాడాలని సోదరభావంతో మెలగాలని ఆయన పేర్కొన్నారు. తాను నాటిన 400 మొక్కలలో దాదాపు 100 మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పెరికి వేయడంతో దాదాపు రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు దాసిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, మండల కార్యదర్శి ఈరన్న, తెలుగుయువత నాయకుడు బాలకృష్ణ, భరత్, మాజీ ఎంపీపీ సిద్ధగంగప్ప, పాండురంగప్ప, రామచంద్రప్ప, తదితరులు ఉన్నారు.

'స్థానిక రైతుల నుంచే పాలు సేకరిస్తాం'

మడకశిర టౌన్, జూన్ 20: ఎమ్మెల్యే ఎంఎస రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తి ప్పేస్వామి సూచనల మేరకు స్థానికులతోనే పాలను సేకరించనున్నట్లు పట్టణంలోని ఆరోగ్య పాలడెయిరీ అధికారులు గురువారం తెలిపారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల డెయిరీని సందర్శించినట్లు తెలిపారు. డెయిరీ మేనేజర్ మంజునాథ్ మాట్లాడుతూ... ప్రస్తుతం కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల రైతులు 1200 లీటర్ల వరకు పాలు తెచ్చే వారని, ఇకపై ఈ ప్రాంతం రైతుల నుంచే సేకరిస్తామని తెలిపారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత : పట్టణంలోని అంబే ద్కర్ సర్కిల్‌లో చాలాఏళ్లగా రహదారికి అడ్డంగా పెద్ద గుంత ఏర్పడింది. దీంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు, ప్రయాణికులు ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులను, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే రెండు రోజుల కిందట ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశాల మేరకు... ఆర్ అండ్ బీ అధికారులు గురువారం మరమ్మతు పనులను చేపట్టారు. డ్రైనేజీ పైపు పగలడం వల్ల ఈ గుంత ఏర్పడింది. కొత్త పైపును ఏర్పాటు చేసి దానిపై మరమ్మతు పనులను చేపట్టారు. దీంతో పట్టణ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నగలు, నగదు కోసం వృద్ధురాలి హత్య


వడ్డె చంద్రక్క మృతదేహం

మడకశిర రూరల్/పావగడ, జూన్ 20 : డబ్బు, బంగారు నగల కోసం మహిళ గొంతుకోసి హత్యచేసినట్లు పావగడ పోలీసులు తెలిపారు. ఈ సంఘట న పావగడ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మాచరాజనహళ్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పావగడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర మండలం ఆంధ్ర ,కర్ణాటక సరిహద్దులో ఉన్న ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క(62) అనే మహిళ తన పొలంలో పనిచేస్తుండగా బుధవారం సాయం త్రం గుర్తుతెలియని దుండగులు ఆ మె వద్ద ఉన్న రూ.25వేలు నగదు, చెవిలో ఉన్న బంగారు కమ్మలు లాక్కున్నారు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆమె గొంతుకోసి అక్కడి నుంచి పరారీ అయి ఉంటారని తెలిపారు. అటుగా వెళ్లినవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ మరియప్ప, సీఐలు సురేష్, గిరీష్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు. త్వరలోనే హంతకులను పట్టుకుంటామన్నారు.

మంత్రి సవిత బాధ్యతల స్వీకరణ


రాష్ట్ర సచివాలయానికి వెళ్తున్న మంత్రి సవిత


మంత్రి సవితను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

మంత్రికి టీడీపీ జిల్లా అధ్యక్షుడి అభినందనలు

హిందూపురం, జూన్ 20: రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సవితకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అభినందనలు తెలిపారు. సవిత గురువారం విజయవాడలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కొల్లకుంట అంజినప్ప ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. తమశాఖ ద్వారా అందే ప్రభుత్వ పథకాలను జిల్లాకు సాధ్యమైనంత ఎక్కువగా అందించాలని కోరినట్లు తెలిపారు. మరీ ముఖ్యంగా బీసీ గురుకుల పాఠశాలలో సీట్లు పెంచాలని కోరినట్లు తెలిపారు. బీసీలకు సంబంధించి రుణాలు ఇవ్వాలని, వెనుకబడిన ఉమ్మడి జిల్లాలో బీసీలు అధికంగా ఉన్నారని ఈ జిల్లాకు మరింత రుణాలు పెంచాలని కోరినట్లు అంజినప్ప ఓ ప్రకటనలో తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్నటీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 20 : బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా గురువారం సవిత విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించడంతో పెనుకొండలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం కేక్‌కట్‌చేసి, ఎన్టీఆర్ విగ్రహం వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ... సవిత పెనుకొండలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిందని, ఆమె మంత్రి కావడం పెనుకొండ ప్రజల అదృష్టమన్నారు. పెనుకొండ ప్రజలు ఆమెపై పెట్టుకున్న నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో నిరూపిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, గుట్టూరు సూరీ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, కేపీ శ్రీనివాస్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీకి ఎంపికైన విద్యార్థినికి సన్మానం


విద్యార్థిని భూమికను సన్మానిస్తున్న దృశ్యం

అగళి, జూన్ 20: మద్రాస్ ఐఐటీకి ఎంపికైన విద్యార్థిని భూమిక ను, తండ్రి మంజు నాథను మండలం లోని మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు దాసేగౌడ తిమ్మప్ప, ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భూమిక మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి, అనంతరం ఆర్డీటీ రి సహకారంతో విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివిందన్నారు. ఆమె ఐఐటీకి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. మారుమూల గ్రామంలో జన్మించిన భూమిక ఐఐటీకి ఎంపికై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగానే ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి, ఆమె తండ్రికి శాలువకప్పి, పూలమాలలువేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వవిద్యార్థులు విద్యార్థినికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 20: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద 14వ తేదీన ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాసులు సూచనల మేరకు రంగంలోకి దిగిన పట్టణ సీఐ హరినాథ్, పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి గురువారం బెళుగుప్ప రోడ్డులోని నాగులకట్ట వద్ద అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ హరినాథ్‌ను ఎస్పీ అభినందించారు.

నీట్ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

హిందూపురం అర్బన్, జూన్ 20: నీట్-2024 ఫలితాలపై విద్యార్థుల తల్లితండ్రులకు అనేక అనుమానాలు ఉన్నందున సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒకే పరీక్షా కేంద్రంలో ఒకే సీరియల్ నెంబర్లతో ర్యాంకులు రావ డం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది జీవితాలు ఆధారపడి ఉన్నాయన్నారు. నీట్ ఫలితాలపై ప్రత్యేక బృందాలతో సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జశ్వంత్, పవన్, లిఖిత్, అబి, హసేన్, మహేష్, విక్రమ్, సురేష్, మంజునాథ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రైతులు డిజిటల్ లావాదేవీలు సాగించాలి

ఇస్లాపురం సొసైటీ సీఈఓ హరిక్రిష్ణ

పెనుకొండ రూరల్, జూన్ 20: ఇస్లాపురం పీఏసీఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అప్పులు తీసుకున్న రైతులు డిజిటల్ లావాదేవీలు కొనసాగించాలని ఇస్లాపురం సొసైటీ సీఈఓ హరిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలలో ఆన్‌లైన్ లావాదేవీలు జరుపుతు న్నారన్నారు. ఈ క్రమంలో ఇస్లాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.300 కట్టి సభ్యత్వం పొందిన రైతులు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. అదేవిధంగా ఇస్లాపురం సొసైటీ బ్యాంక్‌లో దాదాపు ఏడు వేల మంది రైతులు వివిధ రకాల పంట రుణాలు తీసుకున్నారన్నారు. వారంతా 2023-24 సంవత్సరానికి సంబంధించి పంట రుణాలను త్వరగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రుణాలను రెన్యువల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వర్తిస్తాయన్నారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి ఈ నెలాఖరులోగా పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని ఆయన సూచించారు. రెన్యువల్‌కు వచ్చే రైతులు 1బి అడంగల్, నాలుగు పాస్‌ఫొటోలు, ఆధార్ అప్డేట్, రేషన్‌కార్డు, భూమిపాసుపుస్తకం జిరాక్స్‌ను వెంట తీసుకురావాలని సొసైటీ సీఈఓ తెలిపారు.

'పిల్లల చదువుకు పునాది అంగన్‌వాడీ'


కొల్లకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

హిందూపురం అర్బన్, జూన్ 20: చిన్నారుల భవిష్యత్తుకు, చదువులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు అని సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని కొల్లకుంట 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రాడ్యుయేషన్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీ బడి అమ్మబడి లాంటిదన్నారు. అలాగే కాలనీలో ర్యాలీ చేపట్టి అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు శాంతి, అనిత, బ్లాక్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వరుణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ

గోరంట్ల, జూన్ 20: మండలంలోని జక్కసముద్రం గ్రామంలో శుద్ధమైన తాగునీటి సరఫరా కోసం సుజల వాటర్ ప్లాంటు ఏర్పాటుకు గురువారం టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. గతంలో సచివాలయం వద్ద సుజల వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని తలపెట్టినా... గ్రామస్థులకు అసౌకర్యంగా ఉంటుందని అభ్యంతరం తెలిపారు. దీంతో ప్రస్తుతం రూ.5లక్షల వ్యయంతో సుజల వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. సర్పంచ్ భర్త అశ్వత్థరెడ్డి, ఉప సర్పంచ్ కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు టీడీపీ నాయకులు బాలక్రిష్ణ, హరి, మిత్రవాటర్‌ప్లాంటు గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేలం పాటతో రూ.13.07 లక్షల ఆదాయం

చిలమత్తూరు, జూన్ 20: పంచాయతీకి ఆదాయ వనరులుగా ఉన్న వారపుసంత, కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి రూ. 13.07 లక్షల ఆదాయం వచ్చినట్లు చిలమత్తూరు పంచాయతీ కా ర్యదర్శి రామనేనాయక్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వారపుసంత, కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలు, జంతువధ శాల, బస్టాండుకు బహిరంగ వేలం పాట నిర్వహించా మన్నారు. అయితే వారపుసంతను రూ. 2.37 లక్షలకు, కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలను రూ. 10.7 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారన్నారు. జంతువధశాల, బస్టాండు వేలం పాట వాయిదా పడినట్లు తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పంచాయతీకి సుమారు రూ.2 లక్షల ఆదాయం పెరిగిందన్నారు.

గుణాత్మక విద్య బోధించాలి: ఎంఈఓ-2

అగళి, జూన్ 20: విద్యార్థులకు గుణాత్మక విద్య బోధించాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు.. ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామాల్లో పాఠశాలలకు రాకుండా ఇంట్లోనే ఉండే బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకోవాలని తెలిపారు. మండలంలోని పీ బ్యాడిగెర, హెచ్‌డీ హళ్లి, గాయత్రి కాలనీ, ఇరిగేపల్లి తదితర పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయుల హాజరుపై పరిశీలించారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు హాజరు కాకపోతే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు.

సంపత్‌ను హత్య చేసిన వారిని అరెస్టు చేయాలి

రాజకీయ ఐక్యవేదిక నాయకుల డిమాండ్

హిందూపురం అర్బన్, జూన్ 20: న్యాయవాది సంపత్‌కుమార్‌ను హత్య చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని రాజకీయ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్టుహౌస్‌లో గురువారం రాజకీయ ఐక్యవేది క నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంపత్ హత్యకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేసి ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. త్వరతగతిన న్యాయం చేయాలని సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ శ్రీరాములు, సీపీఐ వినోద్‌కుమార్, కార్మిక సంఘం నాయకులు రవికుమార్, దళి నాయకుడు నారాయణ, ఎరుకల సంఘం నాయకుడు శంకర్, ఎంఐఎం మున్నా, మాలమహానాడు నాగన్న, ప్రజా సంఘాల నాయకుడు కమల్‌భాష, గోపాల్, హనుమంతు నాగరాజు తిమ్మక్క తదితరులు ఉన్నారు.

నగదు, బంగారం చోరీ

కళ్యాణదుర్గం, జూన్ 20:
మరో వారం రోజుల్లో కుమారుడి పెళ్లి. పెళ్లి కోసం దాచి వుంచిన నగదు, బంగారం చోరీ కావడంతో బాధితులు లబోదిబోమన్నారు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన మేరకు మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ, గోవిందమ్మల కుమారుడి పెళ్లి వారం రోజుల్లో జరుగనుంది. పెళ్లి ఖర్చులకు రూ.2.65 లక్షలు సమకూర్చుకుని, మూడు తులాల బంగారం చేయించి ఇంట్లోని బీరువాలో దాచుకున్నాడు. కుటుంబ యజమాని బుధవారం రాత్రి ఇంటిపైన నిద్రిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువా తాళాలు ధ్వంసం చేసి అందులో వున్న బంగారం నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయమే ఇంట్లోకి వచ్చిన ఆదినారాయణ చెల్లాచెదరుగా పడి వున్న బట్టలు, బీరువా చూసి అవాక్కయ్యాడు. కుమారుడి పెళ్లి కోసం దాచిన నగదు, బంగారం ఎత్తుకెళ్లారని లబోదిబోమన్నాడు. సంఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ విభాగాన్ని సందర్శించిన భారత మాజీ రాయబారి రోమేల్


ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడుతున్న రోమేల్

పెనుకొండ, జూన్ 20 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగాన్ని భారత మాజీ రాయబారి రోమేల్ గురువారం సందర్శించారు. కళాశాలకు వచ్చిన ఆయనకు ప్రిన్సిపాల్ కేశవ్‌రావు, అధ్యాపకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగే ప్రతి సేవా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పుట్టపర్తిలో జరిగే సేవా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్న అధ్యాపకులను అభినందించారు. త్వరలో జరిగే పర్తియాత్రకు విద్యార్థులను ఆహ్వానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దినేష్, కరుణాకర్, సత్యసాయి కన్వీనర్ శంకర్, అధ్యాపకులు ప్రతాప్, రామన్న, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు సిబ్బంది పాల్గొన్నారు.